## దుబ్బాక ఎమ్మెల్యేకు ఫొటో బహూకరణ



గజ్వేల్, జనవరి 8: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం గజ్వేల్ జడ్పీటీసీ మల్లేశం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫొటోను బహూకరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో టెండర్ నిర్వహిస్తున్న అధికారులు

## కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో టెండర్లు

దుబ్బాక, జనవరి 8: దక్షణ కాశీగా పేరొందిన కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో సోమవారం మాఘ అమావాస్య జాతరకు సంబంధించి టెండర్లు నిర్వహించారు. దేవాలయ ఈవో విశ్వనాథశర్మ, ఆలయ అర్చకులు, సర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో టెండర్లు జరిగాయి. ప్రసాదం, పార్కింగ్, కొబ్బరికాయలు, ఆలయంలో డెకరేషన్‌కు సంబంధించి విద్యుత్‌దీపాలు, పూల అలంకరణలతోపాటు పలు మరమ్మతులకు సంబంధించి టెండర్లు వేశారు. వీటిలో పలు టెండర్లకు సరైన వేలంపాట రాకపోవడంతో మరో రోజు వాటికి తిరిగి వేలం నిర్వహిస్తామని ఆలయ ఈవో విశ్వనాథశర్మ తెలిపారు.



కొమురవెల్లిలో లిఫ్టును ప్రారంభిస్తున్న దాతలు

## కొమురవెల్లిలో లిఫ్ట్ ప్రారంభం

చేర్యాల, జనవరి 8 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో లిఫ్టును సోమవారం దాతలు ప్రారంభించారు. హైదరాబాద్ నగరంలోని కొంపల్లికి చెందిన బబ్బూరి నాగమణి దంపతుల కుమారుడు బాలకృష్ణ భారత్ ఇంజినీరింగ్ ఎంటర్‌ప్రైజెస్ పేరిట రూ.9 లక్షలతో భక్తుల సౌకర్యార్థం లిఫ్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలు కొనసాగుతుండగా, ఈ నేపథ్యంలో బాలకృష్ణ ఆయన తల్లిదండ్రులు, స్థానికులతో కలిసి లిఫ్టును ప్రారంభించారు.



ఆశీర్వచనం చేస్తున్న సత్యాత్మతీర్థ శ్రీపాదులస్వామి

## ప్రతి ఒక్కరూ దైవారాధన అలవర్చుకోవాలి

వర్గల్, జనవరి 8: సమాజంలో జరుగుతున్న వికృతచేష్టలకు పరాకాష్ట పలకాలంటే ప్రతి ఒక్కరూ దైవారాధనను అలవర్చుకోవాలని జగద్గురు ఉత్తరాధిపతి మఠాధిపతి 1008 సత్యాత్మతీర్థ శ్రీపాదులస్వామిజీ అన్నారు. వర్గల్ మండల పరిధిలోని నాచగిరి క్షేత్ర ఆలయ వద్ద రాఘవేంద్రస్వామి బృందావనంలో రెండు రోజులపాటు తెలంగాణ మధ్వమండలి ఆధ్వర్యంలో జరిగిన మఠం సంస్థాపన పూజలో పాల్గొని భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. సోమవారం చివరి రోజు మూలరామ పూజ నిర్వహించారు. అనంతరం నాచగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని తిరుగుప్రయాణమయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ మధ్వమండలి అధ్యక్షులు ఉపేందర్‌రావు, పూజారులు గోవర్ధన్‌రావు, ములుగు ప్రవీణ్‌కుమార్, రఘుపవన్, లక్ష్మీకిరణ్, నాచగిరిక్షేత్రం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ హరిపంతులు, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

## ఎమ్మెల్యేగా గెలువని వ్యక్తి ఎంపీగా ఎలా గెలుస్తాడు

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

కొమురవెల్లి, జనవరి 8 : వివిధ పార్టీల్లో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా టికెట్ పొంది ఓడిపోయిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి.. ఎంపీగా ఎలా గెలుస్తాడని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ప్రశ్నించారు. సోమవారం కొమురవెల్లి సీపీఎం కార్యాలయంలో మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కొమ్మూరి 2018లో ఎమ్మెల్సీగా పోటీ చేసి ఓడిపోయారని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి పోటీ చేసి ఓడిపోయారని గుర్తు చేశారు. గతంలో చేర్యాల నుంచి గెలిచిన కొమ్మూరి ప్రజలను ఏనాడూ పట్టించుకోలేదని, కనీసం సొంత గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయలేదన్నారు. ఇప్పుడు తన అనుచరులతో ఎంపీ టికెట్ ఇవ్వాలని పత్రిక ప్రకటనలు ఇప్పించుకునే స్థాయికి దిగజారడని విమర్శించారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యురాలు అత్తిని శారద, దాపరి ప్రశాంత్, మండల నాయకులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, సార్ల యాదయ్య, ఆరుట్ల రవీందర్, శ్రవణ్‌చారి, భరత్, పవన్, మహేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

- పరీక్షలు ముగిసే వరకు సెలవు తీసుకోకుండా పనిచేయాలి
- రోజువారీ అటెండెన్స్, ఇతర వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి
- అప్‌లోడ్ చేయకపోతే కఠిన చర్యలు
- అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్
- విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం

సిద్దిపేట అర్బన్, జనవరి 8 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ ఉపాధ్యాయ, అధికార వర్గాలను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలోని ఎంఈవో, ఎంఎన్‌వో, సీహెచ్‌ఎంలు, ఉపాధ్యాయ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వార్షిక పరీక్షలు ముగిసే వరకు ఏ ఒక్క ఉపాధ్యాయుడు సెలవు తీసుకోకుండా పని చేయాలని సూచించారు. జిల్లా విద్యాధికారి మొదలు మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, ఉపాధ్యాయులు సైతం వార్షిక పరీక్షలు ముగిసే వరకు నెలా వారీగా టూర్ డైరీని తయారు చేసుకొని తమ సంతకంతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతం, ఇతరత్రా వివరాలను తప్పని సరిగా అప్‌లోడ్ చేయాలని.. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా జిల్లాను పది ఫలితాల్లోఅగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఉపాధ్యాయుడు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఎంఈవో తమకు కేటాయించిన పాఠశాలలను విజిట్ చేసి బోధన, మధ్యాహ్న భోజనం, ఇతరత్రా అంశాలను పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్ భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రధానోపాధ్యాయులు

## మిషన్ భగీరథ పైప్‌లైన్ పనుల పరిశీలన



అక్కన్నపేట మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న డీఈ, సర్పంచ్

అక్కన్నపేట, జనవరి 8 : మండల కేంద్రంలోని మిషన్ భగీరథ నీటి సరఫరా పైప్‌లైన్ పనులను సోమవారం హుస్నాబాద్ డివిజన్ మిషన్ భగీరథ డీఈ రుహీనాత స్కీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి పైప్‌లైన్ నిర్మాణ పనుల గురించి వివరించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ అక్కన్నపేట నుంచి గ్రామ పరిధిలోని చౌడుతండా మీదుగా బోదర్‌వాగు తండా, మంజ్య తండా వరకు గతంలో మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం పైప్‌లైన్ వేశామని, అయితే, ఆ తండాలకు సరిగా నీటి సరఫరా కాకపోవడంతో కన్నారం ప్రధాన పైప్‌లైన్‌కు ప్రత్యేకంగా పైప్‌లైన్ అనుసంధానం చేశామని తెలిపారు. దీంతో సులువుగా తండాల్లోని ఇంటింటికీ తాగునీరు అందుతుందన్నారు. డీఈ వెంట విద్యుత్ ఏఈ హరీశ్‌రెడ్డి, కాశబోయిన ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర ఆర్థిక సేవా విభాగం డైరెక్టర్ సురేందర్‌సింగ్



ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్‌ను అందజేస్తున్న కేంద్ర ఆర్థిక సేవా విభాగం డైరెక్టర్ సురేందర్‌సింగ్

గజ్వేల్, జనవరి 8: పేదల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలని కేంద్ర ఆర్థిక సేవా విభాగం డైరెక్టర్ సురేందర్‌సింగ్ అన్నారు. సోమవారం మండలంలోని బెజుగామలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు, చిన్న వ్యాపారుల కోసం ముద్ర, మహిళా సంఘాలకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నదన్నారు. ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లను పంపిణీ, ప్రతి కుటుంబానికి న్యాయం జరుగుతున్నదన్నారు. బ్యాంకుల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని రైతులు వ్యవసాయ రంగంలో రాణించాలన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం, ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ పంపిణీ చేపట్టారు. అంతకుముందు గ్రామస్తులతో కలిసి అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఏవో శివప్రసాద్, డీఎంహెచ్‌వో కాశీనాథ్, పౌరసరఫరాల శాఖాధికారి తనుజ, ఎల్‌ఎండీ సత్యజిత్, బ్యాంకు అధికారులు దినేశ్, సుజాత, ఎంపీడీవో మచ్చేందర్, ఏడీఏ బాబునాయక్, ఏవో నాగరాజు, ఇండియన్ గ్యాస్ నిర్వాహకురాలు శిరీష, సర్పంచ్ అండాలు, నాయకులు రాంరెడ్డి, మహేశ్, అశోక్ తదితరులున్నారు.



చేర్యాలలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

## కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలి

- రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ చక్రధారి

చేర్యాల, జనవరి 8 : కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని జనవరి 31లోపు అమలు చేయాలని రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ చక్రధారి డిమాండ్ చేశారు. సోమవారం చేర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు అంకుగారి శశిధర్‌రెడ్డి, తోకల ఉమారాణి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేశ్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జనవరి 31లోపు చేర్యాల రెవెన్యూ డివిజన్ జీవో ఇవ్వాలని, లేదంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. డివిజన్ ఏర్పాటుతో ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో నాయకులు అందె బీరయ్య, రామగల్ల నరేశ్, రమేశ్, నాగరాజు, విజయరెడ్డి, చంద్రం, లక్ష్మారెడ్డి, పాకాల ఇసాక్, కుర్రారం బాల్‌నర్సయ్య, పుల్లని వేణు తదితరులు పాల్గొన్నారు.

# అంతా రామమయం

- ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

గజ్వేల్‌అర్బన్, జనవరి 8: ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. గజ్వేల్ పట్టణంలోని 18వ వార్డులో రామభక్తులు సోమవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళికి అయోధ్య రామయ్య అక్షింతలు అందజేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్, తోట అమరేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, అత్తెల్లి రవి, సంపత్ తదితరులు ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అందజేశారు. 12వ వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, రామభక్తులతో కలిసి గజ్వేల్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ వార్డులో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. సామాజిక సమరసత రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు మున్సిపల్ పరిధిలోని రాజిరెడ్డిపల్లిలో గుడిసెల్లో నివసిస్తున్న సంచార జాతి ప్రజలకు అయోధ్య రాముడి అక్షింతలను అందజేశారు.



గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లిలోని సంచార జాతుల గుడిసెల్లో అయోధ్యఅక్షింతలు పంపిణీ చేసిన డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు

## వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్‌గా శ్రీనివాస్



వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్‌గా నియామకపత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, జనవరి 8 : సిద్దిపేట వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్‌గా మంకాల శ్రీనివాస్ నియమితులయ్యారు. సోమవారం సికింద్రాబాద్‌లోని క్లబ్ ప్రధాన కార్యాలయంలో జిల్లా గవర్నర్ భానూరి నర్సింహులు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి సహకారంతో రీజియన్ ముందుకు తీసుకెళ్లానని తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భూపాల్

మిరుదొడ్డి, జనవరి 8: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల భూపాల్‌ను నియమిస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశాల మేరకు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాల భూపాల్‌మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు.

## ఎన్‌సీడీ వ్యాధులపై అవగాహన కల్పించాలి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 8 : అసంక్రమిత వ్యాధుల(నాన్ కమ్యూనికేబుల్ డిసీస్)పై ప్రజలకు అవగాహన కల్పించాలని లద్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సుధీర్‌రాజ్ వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం మద్దూరు మండలంలోని లద్నూర్ పీహెచ్‌సీలో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి ఎన్‌సీడీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్, నోరు, బ్రెస్ట్, గర్భకోశ ముఖద్వార క్యాన్సర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌సీడీ వ్యాధులు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయని, క్షేత్రస్థాయిలో స్క్రీనింగ్ త్వరగా పూర్తి చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి చికిత్స అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు స్టువర్ట్‌సన్, ప్రతిభ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్‌సీడీ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుధీర్‌రాజ్

## పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్టీయు సంఘం ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్, జనవరి 8: పీఆర్టీయూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో ముందుంటుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పీఆర్టీయూ సంఘం మండల శాఖ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతి ప్రోగ్రాం ద్వారా ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనవుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రత్లావత్ బొద్దు నాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం సైదులు, వట్టిపల్లి హెచ్‌ఎం సరోజ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి స్పందన

జగదేవ్‌పూర్, జనవరి 8: మండలంలోని కొత్తపేట గ్రామంలో సోమవారం సర్పంచ్ వెంకట్‌రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో మెడిసిటీ మేడ్చల్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి, చెవి, ముక్కు, గొంతు, గడ్డలు, కణతులు, వరిబీజం, గర్భసంచి సమస్యలకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. సుమారు 145 మందికి పరీక్షలు చేశారు. ఆపరేషన్ అవసరం ఉన్న 31 మందిని హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సుమన, గాంధీ, వర్షిని, హరిణి, బాబుగౌడ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

## ఎర్రవల్లిలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

మర్కూక్, జనవరి 8: మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని యూపీఎస్ ఎర్రవల్లి పాఠశాలలో సోమవారం ఎంపీపీ పాండుగౌడ్ సర్పంచ్ భాగ్యాభిక్షపతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దాతల సహకారంతో సుమారు రూ.3 లక్షలతో సర్పంచ్ భాగ్య పిల్లలకు ఆటవస్తువులు, కుర్చీలు, టేబుల్స్ సమకూర్చడం అభినందనీయమన్నారు. మండలంలోనే ఎర్రవల్లి అంగన్‌వాడీ కేంద్రం మోడల్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రామచంద్రం, టీచర్ నాగలక్ష్మి, ఆయమ్మ ఎల్లమ్మ, వార్డు సభ్యుడు శ్రీశైలంయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలకు ఆహ్వానం

గజ్వేల్, జనవరి 8 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తాలూకా స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీరామకోటి భక్తసమాజం అధ్యక్షుడు రామరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల మహిళలు ఏ-4 సైజు పేపర్‌పై చుక్కలతో కూడిన రంగుల ముగ్గులు వేసి స్వయంగా లేదా పోస్టు ద్వారానైనా ఈనెల 13వ తేదీలోపు శ్రీరామకోటి భక్తసమాజం రామరాజు, ఇంటి నంబర్ 5-184, విద్యానగర్, గజ్వేల్, పిన్ 502278 చిరునామాకు పంపించాలని కోరారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు 50 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. పూర్తి వివరాల కోసం సెల్: 9849947944 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## రేపు విద్యుత్ గ్రీవెన్స్ డే

దుబ్బాక, జనవరి 8 : దుబ్బాక విద్యుత్ ఉపకేంద్రం కార్యాలయంలో ఈనెల 10న సీజీఆర్‌ఎఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు దుబ్బాక ఏడీఈ రాంబాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చుతగ్గులు, కరెంట్ బిల్లులకు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేసుకోవచ్చని వివరించారు. వినియోగదారులు కరెంట్ బిల్లు రసీదు, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్ డే కొనసాగుతుందన్నారు.

## రేషన్ డీలర్ల సంఘం మండల కమిటీ ఎన్నిక



మండల అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన గొల్లపల్లి రమేశ్

మద్దూరు (ధూళిమిట్ట), జనవరి 8 : రేషన్ డీలర్ల సంఘం ధూళిమిట్ట మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గొల్లపల్లి రమేశ్, ఉపాధ్యక్షురాలిగా సిరిగిరి యాదలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బుర్ర శ్రీనివాస్, కార్యదర్శిగా ధరావత్ కిషన్‌నాయక్, కోశాధికారిగా మెతుకు మల్లారెడ్డి, కమిటీ సభ్యులుగా ఉమాభవాని, కోల అంజయ్య, పేరం యాదయ్య, ధరావత్ దీప్లానాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

## భక్తురాలి బంగారు ఆభరణాలు చోరీ

చేర్యాల, జనవరి 8: కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవానికి వచ్చిన ఓ భక్తురాలి బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కొంపల్లి ప్రాంతానికి చెందిన సన్న అండాలు మల్లన్న కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు కొమురవెల్లికి వచ్చింది. స్వామివారి కల్యాణంలో పాల్గొన్న అనంతరం గంగరేగు చెట్టు వద్ద ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న 10 తులాల బంగారు గొలుసులు కొట్టివేశారు. చెట్టు ఆవరణ నుంచి బయటకు వచ్చి చూసుకోవడంతో మెడలో బంగారు గొలుసులు లేకపోవడంతో లబోదిబోమంటూ ఇంటికి వెళ్లిపోయింది. అనంతరం కుటుంబ సభ్యులు కొమురవెల్లికి చేరుకుని ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. కాగా, సీసీ కెమెరాల్లో నలుగురు మహిళలతో కూడిన గ్యాంగ్ అండాలు బంగారు ఆభరణాలు కొట్టివేసినట్లు గుర్తించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వెంకట్

తొగుట, జనవరి 8: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బొంబాయి వెంకట్‌ను నియమిస్తూ సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఉత్తర్వులు జారీ చేసినట్లు బొంబాయి వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు కృష్ణ, రమేశ్, నర్సింహులు మహేశ్ తదితరులున్నారు.